సాక్షి
తిరుపతి
బుధవారం। 19। జూలై। 2023



ఖాకీ నిలయం కళకళ!
శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌ను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు.
- 8లో



గడప గడపలో ఆత్మీయ స్వాగతం
పాకాల మండలం పంటపల్లె పంచాయతీలో మంగళవారం గడప గడపకు మహాపాదయాత్ర నిర్వహించారు.
- 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	35	27
చిత్తూరు	34	26
తిరుమల	30	22
గూడూరు	36	29
నగరి	36	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 12 గంటలు
– హుండీ ఆదాయం రూ.5.40 కోట్లు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 71,894 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 25,208 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 5.40 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.. దర్శన టికెట్లు లేకుంటే దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఘనంగా ముగిసిన నృత్యోత్సవాలు



జ్ఞాపికలు అందుకుంటున్న కళాకారులు

తిరుమల : తిరుమల ఆస్థాన మండపంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఏడుకొండల నృత్యోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్‌ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నంద్యాల వారి ఆధ్వర్యంలో దేశంలోని ఎనిమిది రాష్ట్రాల నుంచి వచ్చిన 700మంది కళాకారులు వివిధ నృత్యాలను ప్రదర్శించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పల్లంశెట్టి సురేష్ తెలిపారు.

30న ఛత్రస్థాపనోత్సవం

తిరుమల : తిరుమలలోని నారాయణగిరిలో శ్రీవారి పాదాల చెంత ఈ నెల 30వ తేదీన ఛత్రస్థాపనోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అర్చక బృందం శ్రీవారి పాదాలకు తిరుమంజనం జరిపించనున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్ఠించి విశేష పూజలు చేపట్టనున్నారు.

పురాణ ప్రాశస్త్యం
సప్తగిరుల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా శ్రావణ శుద్ధ ద్వాదశినాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ ఉత్సవానికి మరో విశేషం ఉన్నట్లు పురాణాల్లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ కాలంలో పెనుగాలులు వీస్తుంటాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఉధృతంగా గాలులు ఉంటాయి. వీటి నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్ఠిస్తారు. వందల ఏళ్లుగా ఛత్రస్థాపనోత్సవం జరుగుతోంది. అందులో భాగంగా నారాయణగిరిలోని శ్రీవారి పాదాలకు తిరుమంజనానికి నిర్వహించేందుకు ఆనంద నిలయంలోని బంగారు బావి తీర్థాన్ని వినియోగించడం ఆనవాయితీ.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



రామగిరిలో చెరుకుపంటను పరిశీలిస్తున్న జేడీ ప్రసాద్‌రావు

పిచ్చాటూరు : రైతులు తాము సాగు చేస్తున్న పంటను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ప్రసాద్ రావు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని రామగిరి, అప్పంబట్టు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. జేడీ మాట్లాడుతూ రైతుభరోసా– పీఎం కిసాన్, పంట బీమా, సున్నావడ్డీ రుణాలు తదితర ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాల్సిందేనని సూచించారు. రైతుభరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సత్యవేడు వ్యవసాయ శాఖ ఏడీ సుబ్రమణ్యం, ఏఓ సంజీవ రెడ్డి, సెరికల్చర్ సహాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ ఓరియంటల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ ఓరియంటల్ డిగ్రీ కళాశాలలో ప్రీ డిగ్రీ(ఇంటర్), డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీటీడీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. రెండేళ్ల ప్రీ డిగ్రీలో సంస్కృతం, తెలుగు, హిందీ కోర్సులకు 18 ఏళ్ల లోపు వయసు గల ఎస్‌ఎస్‌సీ/తత్సమాన విద్యార్హత కలిగిన వారు, మూడేళ్ల సంస్కృతం, తెలుగు, హిందీ కోర్సులకు 21 ఏళ్లలోపు వయసు కలిగి ఇంటర్/తత్సమాన విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. కపిల తీర్థం రోడ్డులోని కార్యాలయంలో రూ.25 చెల్లించి దరఖాస్తులు పొందవచ్చన్నారు.

ఇటు సంక్షేమం.. అటు అభివృద్ధి

"పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి.. ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలి.. యువతకు ఉద్యోగావకాశం కల్పించాలి.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి.. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారు ఇంటిముంగిటే చేర్చాలి.. అన్నదాతలు ఆనందంగా జీవనం సాగించాలి.. ఆడపడుచులు ఆత్మగౌరవంతో ముందడుగు వేయాలి.. దేశంలోనే మన రాష్ట్రం అగ్రపథాన నిలవాలి.. అభివృద్ధి పనుల్లో ఆదర్శవంతంగా పురోగతి సాధించాలి" ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు.

- వైఎస్సార్‌సీపీ పాలనలో 1వ తేదీనే పింఛన్
- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- అవినీతికి కేరాఫ్ చంద్రబాబు
- పేదలకు అండగా వైఎస్ కుటుంబం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్ తదితరులు

కుప్పంరూరల్ : రాష్ట్రంలో అభివృద్ధి.. సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కుప్పం పట్టణంలో నిర్వహించిన రెండో రోజు వార్డు బాటలో ఆయన పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 6 సభల్లో ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ కరోనా కష్టాల్లో రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సీఎం వైఎస్ జగన్ వెనుకంజ వేయలేదని, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పకడ్బందీగా సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. ఓటుకు నోటు కేసులో చంద్రబాబు హైదరాబాదు నుంచి రాత్రికి రాత్రి తప్పించుకుని వచ్చి రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని ఆరోపించారు. ఓ వైపు అప్పులను సరిచేస్తూ, మరో వైపు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కొనసాగిస్తూ సీఎం జగన్ పాలనా దక్షతను చూపించారన్నారు. 35 ఏళ్లుగా కుప్పం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబు ఇక్కడి ప్రజలకు చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో పులివెందులను అద్భుతంగా తీర్చిదిద్దారని, జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో వై ఎస్సార్ కడప జిల్లాను మరింత అభివృద్ధి చేశారని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలంటే వైఎస్సార్, వైఎస్ జగన్ మాత్రమే గుర్తుకువస్తారని వివరించారు. ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సీఎం వైఎస్ జగన్ 4లక్షల ఉద్యోగాలు సృష్టించారని వెల్లడించారు. చంద్రబాబు తన హయాంలో జన్మభూమి కమిటీలను తయారు చేసి ప్రజలను నిలువునా దోచుకున్నారని విమర్శించారు. విద్యావైద్య రంగాల్లో ప్రభుత్వం సమూల మార్పులు చేసిందన్నారు. సర్కారు బడులను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దిందని తెలిపారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో విద్యను అందిస్తోందని చెప్పారు. వైద్యరంగంలో త్వరలోనే 14వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చంద్రబాబు మళ్లీ మోసపు హామీలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. అయితే చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నారా లోకేష్‌కు మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయిలేదన్నారు. మాట ఇస్తే నెరవేర్చే మంత్రి పెద్దిరెడ్డి ముందు ఎప్పుడూ అబద్ధాలే వల్లించే చంద్రబాబు నిలబడలేరని వెల్లడించారు. పవన్‌కల్యాణ్, లోకేష్, చంద్రబాబు అవాకులు చెవాకులు మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇదే విధంగా వ్యవహరిస్తుంటే ప్రజలే మళ్లీ తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, టీటీడీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, ఎంపీపీ అశ్వని, వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు శరవణ, కృష్ణమూర్తి, నితిన్‌రెడ్డి , నాయకులు నరేష్‌కుమార్‌రెడ్డి, మొగసాల కృష్ణమూర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.



సభలకు హాజరైన జనం



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విద్యాసంస్థలతో చర్చలు



సదస్సులో వీసీ భారతి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లోని వివిధ విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఆయా దేశాల అధికార ప్రతినిధులతో చర్చించినట్లు శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ డి.భారతి ఒక ప్రకటనలో తెలిపారు. హర్యాణా రాష్ట్రం గుర్గావ్ ఐఐఎల్‌ఎం, అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ సంయుక్తంగా గత రెండు రోజులుగా నిర్వహించిన ఉన్నత విద్యా జాతీయ మహిళా వీసీల సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సదస్సుకు మహిళా వర్సిటీ వీసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెరికా, ఆస్ట్రేలియా అధికార ప్రతినిధులతో అవగాహన ఒప్పందాలపై చర్చించామని, తద్వారా ఉన్నత విద్యను అంతర్జాతీయంగా మరింత ముందుకు తీసుకెళ్లొచ్చని వీసీ అభిప్రాయపడ్డారు.

గంగమ్మకు పొంగళ్లు



తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మంగళవారం కావడంతో ఆలయంలో అమ్మవారికి ఉదయం అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య మాట్లాడుతూ పునర్నిర్మాణం పనులు అత్యంత వేగంగా పూర్తి చేసినట్లు తెలిపారు.

భారం తప్పిస్తూ.. 'తోడు'గా నిలుస్తూ..!

- చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం
- జగనన్న తోడు పథకం కింద 40,300 మందికి లబ్ధి
- రూ.47.86 లక్షల వడ్డీ చెల్లింపు
- రూ.17.57 కోట్ల రుణాల పంపిణీ



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద చేయూతనందిస్తోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లె క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ఏడో విడత జగనన్న తోడును ప్రారంభించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి జిల్లా స్థాయి కార్యక్రమంలో భాగంగా అధికారులు, చిరు వ్యాపారులు కలిసి వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న తోడు కింద జిల్లాలో 23,201 మందికి రూ.47.86 లక్షల వడ్డీని రీయింబర్స్‌మెంట్ చేశామన్నారు. ప్రస్తుతం 40,300 మందికి రూ.17.57 కోట్లు రుణాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కింద ప్రభుత్వం నాలుగేళ్లుగా చిరువ్యాపారులకు రూ.10వేల వరకు వడ్డీలేని రుణాలను అందిస్తోందని తెలిపారు. సక్రమంగా రుణాలను చెల్లించేవారికి ఏటా అదనంగా రూ.వెయ్యి చొప్పున రుణం మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ఎవరైనా అర్హత ఉన్నా లబ్ధి పొందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తోపుడు బండ్లు, గంపల మీద వస్తువులు, కూరగాయలు అమ్ముకునేవారు. రోడ్ల పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహించేవారు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారికి జగనన్న తోడు పథకం ఒక వరమని వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ సుభాష్, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ, ఏపీఓలు సుబ్బారెడ్డి, ధనంజయ,రాజు, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

రుణపడి ఉంటాం



పూల వ్యాపారం చేసుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నా. జగనన్న తోడు పథకం కింద రూ.10 వేలు తీసుకున్నా. నెలకు రూ.2,500 ఆదాయం వస్తోంది. గతంలో వ్యాపారం చేయడానికి అధిక వడ్డీకి డబ్బులు తీసుకునేవాళ్ల. ఇప్పుడు ఆ భారం తప్పింది. వైఎస్సార్ ఆసరా ద్వారా వచ్చిన రూ.15 వేలను కూడా పూల వ్యాపారం మీదే పెట్టడంతో ఇప్పుడు ఆదాయం పెరుగుతోంది. మాకు ఆర్థికంగా అండగా నిలిచిన జగనన్నకు రుణపడి ఉంటాం.
– వనిత, లబ్ధిదారు, యోగిమల్లవరం, తిరుపతి

వడ్డీ సమస్య తప్పింది



మాది పేద కుటుంబం. నేను గంగా భవానీ మహిళా సంఘంలో లీడర్‌గా ఉన్నా. క్యాటరింగ్ పని చేస్తూ పిల్లలను చదివించుకుంటున్నాం. ఈ వ్యాపారం కోసం అధిక వడ్డీలతో డబ్బులు తీసుకుని నానా అవస్థలు పడేవాళ్లం. వచ్చే ఆదాయం వడ్డీలకే సరిపోయేది. జగనన్న తోడు పథకంతో అధిక వడ్డీల సమస్య తప్పింది. ఈ పథకం కింద వచ్చిన రూ.10వేలను పెట్టుబడిగా పెట్టి రోజూ రూ.3వేల వరకు సంపాదించుకుంటున్నాం.
– మల్లీశ్వరి, లబ్ధిదారు, యోగిమల్లవరం, తిరుపతి

ఎంతో ప్రయోజనం



నేను శ్రీనివాస మహిళా సంఘంలో లీడర్‌గా ఉన్నా. ఒకప్పుడు రూ.5, నుంచి రూ.10ల అధిక వడ్డీకి డబ్బులు తీసుకుని వ్యాపారం చేసుకునేవాళ్లం. వడ్డీలు కట్టేందుకే మా సంపాదన సరిపోయేది. జగనన్న తోడు పథకం ద్వారా అందించిన రూ.10 వేలతో మాకు ఎంతో ప్రయోజనం చేకూరింది. చిరు వ్యాపారులను ఆర్థికంగా ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.
– లక్ష్మి, లబ్ధిదారు, తిరుచానూరు

ఐరాస అవార్డు రేసులో 'ఆర్‌బీకే'



నింద్ర మండలం కొప్పేడులో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- ఆర్‌బీకేని నామినేట్ చేసిన ప్రధాని మోదీ
- సీఎం జగనన్న పథకాలు దేశానికే ఆదర్శం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఐక్యరాజ్యసమితి అవార్డు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన రైతు భరోసా కేంద్రం (ఆర్‌బీకే) వ్యవస్థను నామినేట్ చేయడం దేశానికే గర్వకారణమని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వడమాలపేట సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ప్రభుత్వ పథకాలు దేశ ఖ్యాతిని గడించడం, ప్రపంచ ఖ్యాతికై పోటీపడడం తెలుగు ప్రజలందరూ గర్వించదగిన విషయమన్నారు. మహాత్మా గాంధీజీ కలలను సాకారం చేస్తూ జగనన్న సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి జనరంజక పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక పని జరగాలంటే ధర్నాలు, రాస్తారోకోలు నిత్యం చూశామని, అదే నేటి ప్రభుత్వంలో పలు పథకాలు, పంపిణీ కార్యక్రమాలతో ప్రతి రోజూ పండుగలా ఉంటోందని చెప్పారు. వలంటీర్లు, గృహసారథులు, ఎమ్మెల్యేలు, మంత్రులు గడప గడపకు వచ్చి ప్రజల యోగ క్షేమాలను తెలుసుకుని, సమస్యలను గుర్తిస్తూ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క వడమాల సచివాలయ పరిధిలో రూ.12.65 కోట్ల సంక్షేమం, అభివృద్ధి జరిగిందని తెలిపారు. జగనన్న సురక్షలో 631 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో అందిస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ఆశీర్వదించాలని కోరారు. జగనన్న సైనికురాలినైన తనను నగరి ఎమ్మెల్యేగా ముచ్చటగా మూడోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగరి నియోజకవర్గ పరిశీలకుడు మధుసూదనరెడ్డి, ప్రత్యేక అధికారి గీతారాణి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీలు లోకేశ్వర్‌రెడ్డి, ఉపేంద్ర, సర్పంచులు అంజమ్మ, శ్రీవిద్య, ధర్మయ్య, నాయకులు సురేష్‌రాజు, కరుణాకర్‌చౌదరి, సుధీర్‌రెడ్డి, ఉమాపతి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రతిమ, శేఖర్, నందయ్య, నిరంజన్, వేణు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు మరిన్ని అవకాశాలు



ఉద్యోగాలకు ఎంపికైన వారితో ఎంపీ గురుమూర్తి

రేణిగుంట : తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ఏపీ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ కార్యాలయంలో సూట్స్ కేర్ నెట్‌వర్క్ కంపెనీ వారు మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 120 మంది అభ్యర్థులు మేళాకు హాజరు కాగా 16 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి చేతులమీదుగా ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్ లెటర్స్ అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు మల్టీ నేషనల్ కంపెనీలు ఆసక్తిచూపుతున్నాయన్నారు. ఈ ప్రాంతంలోని నిరుద్యోగులకు భవిష్యత్ మరిన్ని అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. ఉద్యోగాలు పొందిన వారు చిత్తశుద్ధితో పనిచేసి కంపెనీ ఉన్నతి పాటుపడాలని సూచించారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ గోల్డెన్ అవర్ ట్రామా కేర్ సాధించటానికి ఆరోగ్య సేవలను డిజిటలైజేషన్ ద్వారా ప్రజలలోకి తీసుకువస్తామని తెలిపారు. తిరుపతి జిల్లా మాత్రమే కాకుండా చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ప్రతిభ కలిగిన నిరుద్యోగులకు మంచి అవకాశాలను కల్పించబోతున్నట్లు సీఈఓ సోమశేఖర్ రెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏజెన్సీ సంస్థ సీఈఓ కిరణ్ కుమార్ రెడ్డి, జనరల్ మేనేజర్ చెవిరెడ్డి హేమచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సభా స్థలిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ డీకే బాలాజీ

వెంకటగిరి: వెంకటగిరిలో ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్ననేస్తం ఐదో విడత నిధులు విడుదల కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాట్లను జేసీ డీకే బాలాజీ, ఏఎస్పీ కులశేఖర్ పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే ప్రాంతంలో ఏర్పాట్లును పరిశీలించి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యానారాయణరెడ్డి, సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

త్వరలోనే జాతీయ ఉపకార వేతనాలు

తిరుపతి ఎడ్యుకేషన్ : జాతీయ ఉపకార వేతన పోర్టల్‌ను త్వరలోనే కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఓపెన్ చేయనున్నట్లు డీఈఓ వి.శేఖర్ తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్)లో ఎంపికైన విద్యార్థుల మెరిట్ కార్డులను సంబంధిత డీవైఈఓ కార్యాలయాలకు పంపించామన్నారు. ఎంపికైనవారు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంక్‌లో సేవింగ్స్ అకౌంటు తీసుకుని తండ్రి/తల్లిని జాయింట్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థి ఆధార్ నంబరు మాత్రమే ఆ అకౌంటుకు జత చేయాలన్నారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీని మెరిట్ కార్డులో ముద్రించినట్టుగానే ఒక్క అక్షరం తేడా లేకుండా సరిపోయేలా సరిచూసుకోవాలని స్పష్టం చేశారు.

వినాయకుని సేవలో సినీ నటులు



ఆలయంలో నటి కలర్స్ స్వాతి కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం సినీ నటులు దర్శించుకున్నారు. నటి కలర్స్ స్వాతి, బ్రీత్ చిత్రం హీరో చైతన్య కృష్ణ కుటుంబ సభ్యులు వేర్వేరుగా స్వామివారి దర్శనార్థం విచ్చేశారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు.

క్లుప్తంగా

మద్యానికి డబ్బులివ్వలేదని మహిళ ఆత్మహత్య

ఓజిలి: మద్యానికి తల్లి డబ్బులివ్వలేదని ఓ వివాహిత చెట్టుకు ఉరివేసుకుని తనువు చాలించిన ఘటన మండలంలోని రాజుపాళెం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని కురుగొండ గ్రామానికి చెందిన రమణయ్య, ఆదెమ్మ కుమార్తె భూదేవి(35) మద్యానికి బానిసైంది. రాజుపాళెం గ్రామంలో అంకోజీ అనే వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోంది. మద్యం కోసం తల్లి ఆదెమ్మకు ఫోన్ చేసి రూ.3 వేలు ఇవ్వాలని అడగగా.. ఆమె నిరాకరించడంతో మనస్తాపానికి గురైంది. ఆపై ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దారం ఆదిలక్ష్మి తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు


కామరాజు (ఫైల్)

తిరుమల : తిరుమలలో ఓ యువకుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. ఈ నెల 14వ తేదీన శ్రీకాకుళం జిల్లా అమృత నగరం గ్రామానికి చెందిన కామరాజు (19) తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. శ్రీవారి దర్శనానంతరం ఆలయం ఎదుట ఖాళీ స్థలంలో నిద్రించాడు. ఉదయం చూసేసరికి కామరాజు కనిపించలేదు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిస్తే 9440796771 నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ సుధాకర్ కోరారు.

గడప గడపలో ఆత్మీయ స్వాగతం

పాకాల : మండలంలోని పంటపల్లె పంచాయతీలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మహా పాదయాత్రలో చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఉప్పువంక, దేశిరెడ్డిపల్లి, యల్లంపల్లెలో మోహిత్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆదర్శవంతంగా అభివృద్ధి పనులు చేపట్టారని వెల్లడించారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సేవే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తుంటారని తెలిపారు. తండ్రి తగ్గ తనయుడిగా ఉంటానని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగుతున్నానని తనని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

దివ్యాంగుడికి వీల్ చైర్

గతంలో గడపగడపకు మహా పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్థానిక బండ్లదొడ్డికి చెందిన దివ్యాంగుడు ముత్తుహీర్‌కు వీల్ చైర్‌ని ఉచితంగా అందించారు. దివ్యాంగుడి కుటుంబీకులు మోహిత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నాగూర్‌బీ రహీం, సింగిల్ విండో అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, శివప్రసాద్, మోహన్ పాల్గొన్నారు.


దివ్యాంగుడికి వీల్‌చైర్ అందిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

రాచర్ల చెరువు పరిశీలించిన ఆర్డీఓ


రాచర్ల చెరువు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రముని

వరదయ్యపాళెం: మండలంలోని రాచర్ల చెరువును సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ రాచర్ల చెరువు నుంచి అపోలో టైర్ల పరిశ్రమకు నీటిని తరలించాల్సి ఉందని, తక్షణమే చేపలు పట్టడం పూర్తి చేయాలని స్థానిక ఆయకట్టు రైతులకు సూచించారు. చెరువు దాదాపుగా నీరు లేక అడుగంటి పోవడంతో పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వానికి విన్నవించిన మేరకు తెలుగుగంగ ఉపకాలువ నుంచి చెరువుకు గంగ నీటిని మళ్లించాల్సి ఉందన్నారు. అయితే చెరువులో చేపలు పట్టడం చివరి దశకు చేరడంతో స్థానిక ఆయకట్టు రైతుల విన్నపం మేరకు ఆదివారం వరకు గడువు విధించి చేపలు పట్టడాన్ని పూర్తి చేయాలని ఆర్డీఓ సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ సుబ్రమణ్యంరాజు, ఆర్ఐ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శులు నరేష్‌రెడ్డి, రాజేశ్వరి ఉన్నారు.

మేకను కబళిస్తుండగా..


మేకను మింగుతున్న కొండచిలువ

నారాయణవనం: మండలంలోని గోవిందప్ప నాయుడు కండ్రిగలో మంగళవారం కొండచిలువ బారి నుంచి ఓ మేకను రక్షించారు. వివరాలు.. దళితవాడకు చెందిన అన్నెమ్మ తన మేకలను సమీపంలోని అటవీ ప్రాంతానికి మేత కోసం తోలుకెళ్లింది. మధ్యాహ్నం మందలో ఒక మేక తగ్గడంతో ఆమెతో కలిసి తోటి కాపరులతో కలిసి అడవిలో గాలింపు చేపట్టారు. ఓ కొండచిలువ మేకను మింగేందుకు యత్నిస్తుండడాన్ని గుర్తించారు. కొండచిలువను చంపి మేకను రక్షించారు. కొండచిలువ సుమారు 10 అడుగుల పొడవు ఉందని వారు తెలిపారు.


కాపరులు చంపిన కొండచిలువ

● ఖాకీ నిలయం కళకళ!

నాడు


గతంలో వర్షానికి పోలీస్ స్టేషన్ చేరిన నీరు

నేడు


స్టేషన్‌లో నూతన ఫర్నిచర్


ఎస్ఐ గది

తొట్టంబేడు పోలీస్‌స్టేషన్.. ఒకప్పుడు వర్షం వస్తే మడుగును తలపించేది. నీరు లోపలికి ప్రవేశించి రికార్డులు.. ఫర్నీచర్ తడిసిముద్దయ్యే పరిస్థితి ఉండేది. దీంతో సిబ్బంది నానా అవస్థలు పడేవారు. ఈ క్రమంలో సీఐ విక్రమ్, ఎస్ఐ రాఘవేంద్ర పోలీస్‌స్టేషన్ రూపురేఖలను మార్చివేశారు. అత్యాధునిక వసతులు సమకూర్చారు. పచ్చదనం.. పరిశుభ్రతకు ఆలవాలంగా పరిసరాలను తీర్చిదిద్దారు. ఈ మేరకు ప్రజల మన్ననలు అందుకుంటున్నారు.

- తొట్టంబేడు (శ్రీకాళహస్తి)

గంజాయిపై ఉక్కుపాదం

- మూడేళ్లలో 239 కేసుల నమోదు
- ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి



తిరుపతి క్రైం : గంజాయి విక్రయం, వినియోగంపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గత మూడేళ్లలో 239 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆయా కేసులకు సంబంధించి 794 మంది నిందితులను గుర్తించి, 675 మందిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో 48 మంది విశాఖ, ఒడిశాకు చెందిన వారని తెలిపారు. మరో 199 మంది గంజాయి రవాణా చేసేవారు. 24 మంది అంతర్రాష్ట్ర ముద్దాయిలు, 283 మంది గంజాయి అమ్మేవారు, 117 మంది వినియోగదారులు ఉన్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జరిపిన దాడుల్లో సుమారు 3.40 కోట్ల విలువైన 3,407 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పోలీసులు, ఎస్ఈబీ ఆధ్వర్యంలో గత ఆరు నెలలుగా 53 కేసులు నమోదు చేసి 292 మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. రూ.72 లక్షలు విలువైన 720 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 14500, 100కు సమాచారం అందించాలని కోరారు.

రుయా దొంగ దొరికాడు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలోని వయోవృద్ధుల చికిత్స వార్డులో ఇటీవల ఓ వృద్ధురాలు నుంచి కమ్మలు కాజేసిన వ్యక్తిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సెక్యూరిటీ సిబ్బంది కథనం.. రుయా ప్రాంగణంలో అనుమానంగా తిరుగుతున్న మహేష్ అనే వ్యక్తిని పట్టుకుని గతంలో కమ్మలు కాజేసిన సందర్భంలో సేకరించిన ఫొటోలను పరిశీలించారు. ఫొటో మ్యాచ్ అవడంతో సిబ్బంది మంగళవారం వెస్ట్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే వ్యక్తి గతంలో మెటర్నటీ ఆస్పత్రిలో సెక్యూరిటీగా పనిచేస్తూ.. రోగుల నుంచి మొబైల్ దొంగతనం చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో అతన్ని విధుల నుంచి తొలగించారు. పట్టుబడ్డ మహేష్‌ను విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

పాత సామాన్ల యార్డులో అగ్నిప్రమాదం


యార్డులో ఎగసిపడుతున్న మంటలు

చిల్లకూరు : స్థానికంగా ఉన్న పాత సామాన్ల యార్డులో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. పక్కన ఖాళీ స్థలంలోని ముళ్ల చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆ మంటలు యార్డులోని ప్లాస్టిక్ కాగితాలకు అంటుకున్నాయి. దీంతో పాత సామాన్లు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఇంతలో ఓజిలి మండలం ఈఓపీఆర్డీ సిరాజ్ గూడూరుకు వస్తూ మంటలను గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు కోట ఫైర్‌స్టేషన్ సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



తిరుమల: తూర్పు మాడ వీధిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. తిరుమల వన్ టౌన్ ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. తిరుమలలోని తూర్పుమాడ వీధిలో సుమారు 70 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై స్పందించిన పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. అయితే వయసు పైబడి చనిపోయినట్లుగా గుర్తించారు. మృతుడు ఆచూకీ తెలిస్తే 9154141893 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత


ప్రయాణికుడికి నగదు, సెల్‌ఫోన్ అప్పగిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్‌లో ఈనెల 8న హోసూరుకు చెందిన ప్రయాణికుడు చిన్నరాజు రూ.14,500 నగదుతోపాటు ఓ సెల్‌ఫోను పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ ఉద్యోగులు హనుమంత నాయుడు, కొండారెడ్డి ఆ నగదుతోపాటు సెల్‌ఫోన్‌ను గుర్తించి తిరుపతి డిపో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడుకు అప్పగించారు. ఆ మేరకు ఆయన తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేసి ప్రయాణికుడు చిన్నరాజుకు అందజేశారు. ప్రయాణికుడు ఆర్టీసీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

జననేత జగనన్నకు పాలాభిషేకం

- సీఎం సార్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఆర్టీసీ ఉద్యోగులు
- ఉద్యోగులకు హైయ్యర్ పెన్షన్ ఆప్షన్
- దేశంలో ఏపీ ఉద్యోగులకు మాత్రమే ఛాన్స్
- జిల్లాలోని 11 డిపోల్లో డీఎంల నేతృత్వంలో పాలాభిషేకం


మంగళం డిపోలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

తిరుపతి అర్బన్: జిల్లాలోని 11 డిపోల మేనేజర్ల నేతృత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉద్యోగులకు హైయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇవ్వడంపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో దివంతగనేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆర్టీసీకి అండగా నిలిచారు. అదే బాటలో ఆయన తనయుడు ఆర్టీసీ కార్మికులను ఏకంగా ఉద్యోగులుగా చేశారు. అంతే కాకుండా ప్రభుత్వ ఉద్యోగాలకు అందాల్సిన అన్ని రాయితీలు, ప్రయోజనాలను ఆర్టీసీకి అందిస్తూ వచ్చారు. దేశంలో 29 రాష్ట్రాల్లో ఆర్టీసీల్లో కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీని ప్రజారవాణా శాఖగా మార్చి చేసి, ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఖజానా ద్వారా జీతం ఇస్తున్నారు. జీతాలు ఇవ్వాల్సిన డబ్బుల్ని జీతాలతోపాటు అప్పులకు జమ చేస్తూ పీఎఫ్‌కు ఎటువంటి బకాయిలు లేకపోవడంతో ప్రజా రవాణా శాఖలో నుంచి పీఎఫ్‌కు యథావిధిగా 8.3 శాతం కాంట్రిబ్యూషన్ జమ కావడమే కాకుండా హెయిర్ పెన్షన్ ఆప్షన్ కేవలం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజా రవాణా శాఖ ఉద్యోగస్తులకు మాత్రమే దక్కింది. ఈ పెన్షన్‌తో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులతోపాటు వారి తర్వాత వారి సతీమణికి పెన్షన్ సౌకర్యం ఉంటుంది. అంతేకాకుండా బేసిక్ స్కేల్ ఆధారంగా పెన్షన్ మొత్తం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ జిల్లాలోని 11 డిపోల్లోనూ పాలాభిషేకం చేశారు. అలిపిరి డిపోలో మేనేజర్ హరిబాబు, అసిస్టెంట్ డిపో మేనేజర్ పుష్పలత పాల్గొన్నారు. తిరుపతి డిపోలో మేనేజర్ బాలాజి, కార్గో మేనేజర్ సురేంద్రబాబు, వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ తిరుపతి డిపో అధ్యక్షుడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మంగళం డిపోలో మేనేజర్ భాస్కర్‌రావు, అసిస్టెంట్ డిపో మేనేజర్ నిర్మల, వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.


అలిపిరి డిపోలో..


తిరుపతి డిపోలో..

ఎంతో ప్రయోజనం



“ ఆర్టీసీ ఉద్యోగులకు హెయిర్ పెన్షన్ విధానం ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. ప్రతి ఉద్యోగి సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు ఉద్యోగులు కావడంతోనే ఈ అవకాశం దక్కిందని భావిస్తున్నాం. దీంతోనే సీఎం సార్ చిత్రపటానికి పాలాభిషేకం చేశాం.

–హరిబాబు, అలిపిరి డిపో మేనేజర్

మన రాష్ట్ర ఉద్యోగులకే వర్తింపు



దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కార్మికులను ఉద్యోగులుగా మార్పు చేయడంతో హెయిర్ పెన్షన్ ఆప్షన్ అవకాశం దక్కింది. దీంతో ఉద్యోగులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నాం. గతంలో వైఎస్సార్, తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్టీసీకి అండగా నిలుస్తున్నారు.

–బాలాజి, తిరుపతి డిపో మేనేజర్

ఉద్యోగులు ఎంతో సంతృప్తి చెందారు



హెయిర్ పెన్షన్‌తో ఉద్యోగులు సంతృప్తి చెందారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే అన్ని రాయితీలు మాకు లభించనున్నాయి. ప్రజా రవాణ శాఖలో ఉండడంతోనే ఉద్యోగులకు మంచి జరుగుతుందని భావిస్తున్నాం. ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని భావిస్తున్నాం.

–భాస్కర్‌రావు, మంగళం డిపో మేనేజర్

పామును తప్పించబోయి..

కేవీబీపురం: అకస్మాత్తుగా పాము రోడ్డుకు అడ్డంగా రావడంతో ఆగి ఉన్న 108 వాహనాన్ని ఢీకొట్టి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని రాగిగుంట జెడ్పీ పాఠశాల వద్ద మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం.. పిచ్చాటూరు మండలానికి చెందిన రాకేష్ శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం కళాశాలలో జరిగిన సెమిస్టర్ పరీక్షకు హాజరై మరో ఇద్దరు యువకులతో కలిసి ద్విచక్ర వాహనంలో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. రాగిగుంట కూడలి సమీపంలో పాము రోడ్డుపైకి అకస్మాత్తుగా రావడంతదానిని తప్పించే క్రమంలో ఆగి ఉన్న 108 వాహనాన్ని యువకులు ఢీకొట్టారు. ఈ ఘటనలో రాకేష్(18) అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

జాబ్‌మేళాలో 84మందికి ఉద్యోగాలు


జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

పలమనేరు: పట్టణంలోని శ్రీవర్రచెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 84మంది వివిధ ఉద్యోగాలను పొందారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ విజయశేఖరం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చైతన్య మాట్లాడారు. కాగ్నెంట్ ఈ–సర్వీసెస్, ఎకార్ట్ లాజిస్టిక్స్, అజిల్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, రైస్ అండ్ షైన్ గ్రూపు ఆఫ్ కంపెనీస్, అమరరాజ బాటరీస్ కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. ఈ మేళాకు 164మంది హాజరు కాగా, వీరిలో 84మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు హెచ్ఆర్‌లు పవన్, సిసింద్రీ తెలిపారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాలలో ఈనెల 24 నుంచి ఇక్కడి మహిళలు, యువతులకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సును ప్రారంభించనున్నట్టు వారు చెప్పారు.